క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

9న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 9న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మహిళలకు ఆశ్రయం



ఆశ్రయం పొందిన మహిళలతో ప్రగడ వాసు తదితరులు

అల్లిపురం : నగరంలో వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా తిరుగుతున్న మహిళలకు ఏయూటీడీ సిబ్బంది ఆశ్రయం కల్పించారు. అటువంటి వారికి టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళల షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన పూజ (55), ఒడిశాకు చెందిన శాంతి (25), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫాతిమాను రైల్వేస్టేషన్, కంచరపాలెం, కేజీహెచ్ దగ్గర గుర్తించి పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతో ఆశ్రయం కల్పించామన్నారు. వారిని పూణే కేంద్రంగా పని చేస్తున్న శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగించినట్లు వాసు తెలిపారు. త్వరలోనే వారిని వాళ్ల కుటుంబాలకు అప్పగించనున్నట్లు శ్రద్ధా ప్రతినిధి రమాకాంత్ తెలిపారు.

రోగిని కేజీహెచ్‌లో చేర్పించిన ఎమ్మెల్యే వాసుపల్లి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట : జీవీఎంసి 27వ వార్డు అశోక్‌నగర్ ఏరియాలో నివసిస్తున్న సంకిలి సుందరరావు నరాల బలహీనతతో నడవలేని స్థితిలో ఉన్నాడు. మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చొరవ తీసుకుని అతన్ని కేజీహెచ్‌లో చేర్పించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు ఈ రోగి విషయం తెలియజేశారు. అతనికి తక్షణం వైద్య పరీక్షలు నిర్వహించి వార్డుకు తరలించారు.

ఏపీఎస్ ఆర్టీసీలో డోర్ డెలివరీని అభివృద్ధి చేయాలి



కార్గో, పార్శిల్ పాయింట్‌ను సందర్శించి సూచనలిస్తున్న రాజారెడ్డి

దాబాగార్డెన్స్ : ఏపీఎస్‌ఆర్‌టీసీ కార్గో డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎ. రాజారెడ్డి, జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్ మంగళవారం ఏపీఎస్‌ఆర్‌టీసీని సందర్శించారు. పార్శిల్ పాయింట్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డోర్ డెలివరీపై ఆరా తీశారు. ముఖ్యంగా డోర్ డెలివరీని అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ప్రజా రవాణా అధికారి అప్పలరాజు చాంబర్లో పలువురు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఏపీఎస్‌ఆర్‌టీసీ ఉన్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ఎ. అప్పలరాజు, డీసీటీఎంలు బి. అప్పలనాయుడు, సత్యనారాయణ, ఏటీఎం కణితి వెంకట్రావు, డిపో మేనేజర్ రాజు పాల్గొన్నారు.

సుపరిపాలనతో అన్ని వర్గాలకు మేలు

- రేపట్నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచి గురించి ప్రజలందరికీ తెలియజేయనున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏం మేలు జరిగిందన్నది తెలపనున్నారు. వార్డుల వారీగా ప్రత్యక్ష నగదు బదిలీ ఎంత జరిగింది.. తద్వారా ఎంత మందికి ఏ మేరకు లబ్ధి చేకూరిందన్న దానిపై ప్రతి ఒక్కరికీ వివరాలు అందించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 9న 41వ వార్డు సుబ్బలక్ష్మీనగర్-01 సెక్రటేరియట్ పరిధి 21086233, 21086234 సచివాలయాల్లో, 29వ వార్డు దిబ్బలపాలెం (చందకవీధి) 21086173 సచివాలయ పరిధిలో..
- 10న 37వ వార్డు రెల్లివీధి-02 సెక్రటేరియట్ పరిధి 21086235 సచివాలయంలో, 29వ వార్డు దండుబజార్-02లోని 21086176 సచివాలయ పరిధిలో..
- 14న 41వ వార్డు రైల్వే న్యూకాలనీ 21086236 సచివాలయ పరిధిలో, 30వ వార్డు తాడివీధి 21086179 సచివాలయ పరిధిలో..
- 15న 37వ వార్డు జాలారిపేట-04లోని 21086182 సచివాలయ పరిధిలో..
- 16న 30వ వార్డు పెయిందొరపేట-02లోని 21086185 సచివాలయ పరిధిలో..
- 17న 36వ వార్డు రంగిరీజువీధి 21086190 సచివాలయ పరిధిలో, 37వ వార్డు జబ్బరతోట 21086188 సచివాలయ పరిధిలో..



ఇటీవల పార్టీ నాయకులతో భేటీ అయిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- 20న 36వ వార్డు గొడారిగోతులు 21086191 సచివాలయ పరిధిలో, 30వ వార్డు పెయిందొరపేట-01లోని 21096184 సచివాలయ పరిధిలో..
- 21న 38వ వార్డు మట్టా వెంకటప్పయ్య వీధి 21086194 సచివాలయ పరిధిలో, 30వ వార్డు అఫీషియల్‌కాలనీ-01లోని 21086183 సచివాలయ పరిధిలో..
- 22న 35వ వార్డు వెలంపేట-01 21086197 సచివాలయ పరిధిలో, 30వ వార్డు పెయిందొరపేట-03లోని 21086186 సచివాలయ పరిధిలో..
- 23న 39వ వార్డు థామ్సన్‌స్ట్రీట్ 21086200 సచివాలయ పరిధిలో, 37వ వార్డు నేవల్ క్యాంటీన్ 21086187 సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎవరికి ఎంత మేలు జరిగిందో స్పష్టం చేస్తూ..

- వార్డుల్లో గల పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా వచ్చిన మార్పులు, ఇంగ్లీషు మీడియం, పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఎనిమిదో తరగతిలో ట్యాబ్‌ల పంపిణీ వరకూ మారుతున్న విద్యా వ్యవస్థ గురించి తెలపాలి.
- వైద్య రంగంలో జగనన్న ఆరోగ్య సురక్షతో వార్డుల్లో వచ్చిన మార్పును తెలియజేయాలి
- ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి పొందారో, ఎంత మంచి జరిగిందో చెప్పాలి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏయే పథకాలు అమలవుతున్నాయో చెప్పాలి.
- ఒకవేళ ఎవరికైనా ఏదైనా సంక్షేమ పథకం అందకపోతే వారికి అందించేలా చర్యలు తీసుకోవాలి
- నాణ్యంగా అందుతున్న పౌర సేవలు, దిశ యాప్ తదితర అంశాలన్నింటిపైనా ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలి.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా..



అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు, పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి ప్రజలకు చెప్పాలి. ఆర్థిక ప్రగతిలో గతంలో ఎలా ఉండేవాళ్లం. ఇప్పుడెలా ఉన్నాం. అన్న అంశాలు వివరిస్తాం. సచివాలయాల పరిధిలో గల సంఘ పెద్దలతో భేటీ అయి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన ప్రస్తావిస్తూ వారితో కలిసి భోజనం చేసి బస చేయాలని వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, కస్టర్ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు సూచించాం. ఇదో వినూత్న కార్యక్రమం.

– వాసుపల్లి గణేష్‌కుమార్, నియోజకవర్గం, ఎమ్మెల్యే

కార్మిక సమస్యలపై పోరాడిన వ్యక్తి రమేష్

దాబాగార్డెన్స్ : కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడి తన జీవితాన్నే అంకితం చేసిన వ్యక్తి, కార్మిక పక్షపాతి రమేష్ అని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కొనియాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా సిటు పూర్వ ప్రధాన కార్యదర్శి రమేష్ 6వ వర్ధంతి మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ నవంబర్ 7న రష్యా విప్లవ దినమని, అక్కడ కార్మిక రాజ్యం కోసం పోరాడి సాధించుకున్న రోజని చెప్పారు. కమ్యూనిస్ట్ సమాజంలో అసమానతలు లేకుండా అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. అటువంటి సమాజం భారతదేశంలో రావాలని దృఢ సంకల్పంతో పని చేసిన వ్యక్తి రమేష్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు



రమేష్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఎండగట్టేందుకు ఈ నెల 15న విజయవాడలో సీపీఎం చేపట్టే ప్రజా రక్షణ భేరిలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి. గంగారావు, రఘు, చలపతి, వై. రాజు, ఎం. సుబ్బారావు, శాస్త్రి, బి. జగన్, యుఎస్ఎన్ రాజు, జి. పోలేశ్వరరావు, చంద్రమౌళి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

అల్లిపురం : బంగారుమెట్టలోని శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గౌరీ సేవా సంఘం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఒమ్ని ఆర్కే ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ తదితర వ్యాధులపై వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు మానస, భాగ్య, ఆస్పత్రి సిబ్బంది చంటి, గౌరినాయుడు, సమాజం ప్రతినిధులు భీశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి హామీ

జగదాంబ : తన సొంత నిధులతో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మహిళలు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డాన్‌బాస్కో సంస్థలో కుట్టు శిక్షణ పొందిన మహిళలు మిషన్లు మంజూరు చేయాలని కోరారని, వారికి సొంత నిధులతో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాలకు ప్రజాదరణ లభిస్తుందన్నారు. ప్రజలు, కార్యకర్తలకు ఉచిత ఇళ్ల స్థలాల కోసం కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని పలువురు కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఆర్థిక సహాయం కోరగా సహకరిస్తానని తెలిపారు.



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న మహిళలు

ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పీతల వాసు, జీవీఎంసీ 30, 35 వార్డుల ప్రెసిడెంట్లు దశమంతుల మాణిక్యలరావు, అలపన కనకరెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, ఖాజావలీ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్ సీవీ రామన్ జయంతి

అల్లిపురం : మిసెస్ ఏవీఎన్ కళాశాల ఆవరణలో సర్ సీవీ రామన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు సీవీ రామన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ సీవీ రామన్ ఏవీఎన్ కళాశాలలో చదువుకుని కళాశాల కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేశారన్నారు. అటువంటి మహానుభావుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏయూ భౌతిక శాస్త్ర విభాగం అధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ఆవర్తనాలను వివరించారు. సర్ సీవీ రామన్ వంటి మహనీయుడు ఏవీఎన్ కళాశాలలో విద్యనభ్యసించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకర్ నారాయణ, ఫిజిక్స్ విభాగాధిపతి డి.సంతోష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీవీ రామన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సింహాద్రినాయుడు

కేజీహెచ్‌లో సౌర వెలుగులు



సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేజీహెచ్ అధికారులు

- రూ. 50 లక్షలతో 120 కె.వి. ప్లాంట్ నిర్మాణం
- నేడు ప్రారంభం


మహారాణిపేట : ఉత్తరాంధ్ర పేదలకు వైద్య సేవలందిస్తున్న కింగ్ జార్జి ఆస్పత్రిలో సౌర (సోలార్) విద్యుత్ పనులు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టును ఏఆర్ మిట్టల్ సంస్థ సీఎస్‌ఆర్ కింద రూపొందించింది. బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దీనిని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల కేజీహెచ్‌లో విద్యుత్ ఆదా అవుతుందని, ఈ సోలార్ వెలుగులను సీఎస్‌ఆర్ బ్లాక్‌లో ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. పది శాశ్వత సిమ్మెంటు బెంచీలను కూడా కలెక్టర్ ప్రారంభించనున్నారు. వీటిని ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. వీటికి లయన్స్ క్లబ్ సహాయం చేసింది.



కేజీహెచ్ ఓపీలో ప్రారంభానికి సిద్ధమైన సిమెంట్ బెంచీలు

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

సింహాచలం: అడివివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మద్రిపాలెం: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదాలపై కంచరపాలెం పోలీసులు అవగాహన కల్పించారు. ఊర్వశి జంక్షన్‌లో మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో యువతకు సుప్రవాహనం ద్వారా గతంలో జరిగిన ప్రమాదాలను ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే గతంలో జరిగిన ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయి, గాయపడిన వారు వీడియోలను చూపిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగించవద్దని సూచించారు. కార్యక్రమం కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్

మహిళల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ జట్లతో కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం: ఏయూ ఇంటర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.విజయమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ పరిధిలో 9 కళాశాలల నుంచి 100 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో తలపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి పల్లవి, వీఎస్ కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కళాశాల పీడీ సంధ్యారాణి పాల్గొన్నారు.

పేదలకు బాసటగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం
- 3 వేల మందికి పైగా వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న 35వ వార్డు ప్రజలు

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వార్డులో ప్రజలందరూ వైద్య శిబిరాలను వినియోగించుకున్నారు. జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వ్యాధులకు నిర్వహించిన వైద్య శిబిరాల్లో మూడు వేలకు పైగా రోగులు వైద్యం పొందారు. ఇంటి వద్దకే వైద్యం పేరుతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో షుగర్, రక్త పరీక్షతో పాటు నలభై రకాల పరీక్షలు నిర్వహించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షల నిమిత్తం పడే ఇబ్బందుల నుంచి రోగులకు ఉపశమనం కలిగింది. అంతే కాకుండా తక్షణమే ఉచిత మందులు ఇవ్వడంతో వృద్ధుల ఆరోగ్యానికి సురక్ష బాసటగా నిలిచింది. ఈ వైద్య శిబిరాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు జగనన్న అండగా ఉన్నారనడానికి ఉదహరణగా నిలిచింది. ముందుగా చేపట్టిన సర్వే మంచి ఫలితాలు ఇవ్వడంతో శిబిరాలు అనుకున్న దాని కంటే విజయవంతమయ్యాయి.



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

35వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ జరిగిన తీరు

- ఏడు సచివాలయులు
- వెలంపేట-3
- వెలంపేట-4 (కల్లుపాకలు)
- వేలంపేట-5 (గాజులవీధి)
- టౌన్‌కొత్తరోడ్డు
- మున్సిపల్ స్టేడియం
- ఉడ్‌యార్డు స్ట్రీట్
- ప్రసాద్‌గార్డెన్స్
- మొత్తం వైద్య శిబిరానికి వచ్చిన రోగుల సంఖ్య : సుమారు 3 వేలు
- కంటి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు సుమారు : 1000 మంది
- మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించిన వారి సంఖ్య : 40

మాతాశిశు మరణాల రేటు తగ్గుదలకు కృషి

మహారాణిపేట : మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై అందరిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. మాతాశిశు మరణాలను తగ్గించడానికి ప్రతి ఏడాది నవంబర్ 7న శిశు సంరక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నవజాత శిశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించి శిశు మరణాల రేటు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ మాట్లాడుతూ గైనిక్ విభాగంలో లేబర్ రూమ్‌లో బయో మెడికల్ వేస్ట్ గురించి ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ చిన్నారులకు వచ్చే వ్యాధులను తల్లి గుర్తించి వైద్యం చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ షర్మిల, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటేశ్వరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ పిల్లల డాక్టర్ పి.చక్రవర్తి, డాక్టర్ శరణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.మనోరమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు. చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం

తాటిచెట్లపాలెం : దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టారు. రైళ్లలో దీపావళి సామగ్రి, మండే స్వభావం గల పదార్థాలు తరలించకూడదని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించారు. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

కంచరపాలెం : జోన్-5లో గల 24 వార్డుల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. మంగళవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్ ఛార్జీల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, గెడ్డల్లో చెత్తా చెదారాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. క్లాప్ వాహనాల టైం విధిగా నమోదు చేయాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలకు సూచించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణలో పారిశుధ్య సిబ్బందిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతివారం రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని జెడ్సీ హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఎకో వైజాగ్‌లో జోన్ ముందంజలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దనరావు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, జోన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ కృష్ణ

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ రుమా డీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెండ్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.



సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు